# తొలి వెలుగు

జాతీయ పత్రిక

మన భాష.. మన పత్రిక..

TOLE VELUGU JATIYAPATRIKA

TGTEL/26/A6221









| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| యాదాద్రి భువనగిరి | బుధవారం | 29-7-2026 | సంపుటి: 01 | సంచిక : 01 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
| Yadadri Bhuvanagiri | Wednesday | 29-7-2026 | VOLUME:01 | ISSUE:01 | PAGES:08 | COST:2/- |



## మంత్రి పదవికి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలి: రోజా

డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న రోజా

427 మందికి అక్రమంగా పోస్టులు కట్టబెట్టారని ఆరోపణ

లోకేశ్ రాజీనామా చేసేంత వరకు పోరాటం ఆగదని వ్యాఖ్య



డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల నిర్వహణలో భారీగా అక్రమాలు, కుంభకోణం జరిగాయంటూ మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పై నిప్పులు చెరిగారు.

2లో



## హైదరాబాద్ పోలీసుల అదుపులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి!

మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో కేసు నమోదు

మిర్యాలగూడ వద్ద ట్రేస్ చేసి అత్తాపూర్ స్టేషన్‌కు తరలింపు

ఆరోపణలు అవాస్తవమన్న ఉదయ్ రెడ్డి.. విచారణకు సహకరిస్తానని వెల్లడి

హైదరాబాద్ : మహిళా ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలో ఆయన్ను

(మిగతా 2వ పేజీలో)

# పార్టీ లైన్ దాటలేదు..

దుష్టశక్తుల వల్లే వివాదం: టీడీపీ కమిటీ ముందు బోండా ఉమ వివరణ

గుంటూరు సభ వివాదంపై టీడీపీ కమిటీకి వివరణ ఇచ్చిన బోండా ఉమ

పార్టీ లైన్ దాటలేదని, చంద్రబాబు ఆదేశాలే శిరోధార్యమని స్పష్టీకరణ

సోషల్ మీడియా, కొన్ని దుష్ట శక్తులు తన మాటలను వక్రీకరించాయని ఆరోపణ

అంబటి రాంబాబుతో జరిగింది బహిరంగ పలకరింపులే, రహస్య భేటీ కాదన్న ఉమ

భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని పార్టీకి హామీ

2లో



గుంటూరులో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ కార్యక్రమంలో వైసీపీ నేత అంబటి రాంబాబుతో సమావేశం కావడంపై చెలరేగిన వివాదంపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు వివరణ ఇచ్చారు. దీనిపై పార్టీ అధిష్ఠానం ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ముందు మంగళవారం ఆయన హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడులతో కూడిన కమిటీకి తన వాదనను సమగ్రంగా వినిపించారు. తాను పార్టీ లైన్‌ను ఎప్పుడూ దాటలేదని, చంద్రబాబు ఆదేశాలను ధిక్కరించే ప్రసక్తే లేదని, చంద్రబాబు



## అమెరికాలో మరో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ మహిళ దుర్మరణం

న్యూజెర్సీ రోడ్డు ప్రమాదంలో దీపారెడ్డి అనే మహిళ మృతి

కారు సిగ్నల్ వద్ద వేచి ఉన్న సమయంలో వెనకనుంచి ఢీకొన్న మరో కారు

దీపారెడ్డిది రంగారెడ్డి జిల్లా ఆకుతోటపల్లి గ్రామం

2లో

## తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే: రాంచందర్‌రావు



తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం అవుతోందన్న రాంచందర్ రావు

చదువుకున్న యువత పార్టీలో చేరుతున్నారని వెల్లడి

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యాఖ్య

## బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా: రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలన్న హైకోర్టు

హైకోర్టు ఆదేశాలు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్న కేటీఆర్

హైడ్రా పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ





2లో

### శివరాజ్ సింగ్ చౌహాన్ తో

# రేవంత్ భేటీ..

## 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని విన్నపం

గత ప్రభుత్వ హయాంలో గృహనిర్మాణ రంగం నిర్లక్ష్యానికి గురైందని కేంద్ర మంత్రికి తెలిపిన రేవంత్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చాలని విన్నపం

గ్రామీణ కుటుంబాలను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలన్న సీఎం

ఢిల్లీ : ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గ్రామీణ గృహనిర్మాణ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు. ఈసారి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు

(మిగతా 2వ పేజీలో)

# అమరావతి అంటే ఆ 29 గ్రామాలే కాదు..

విజయవాడ, గుంటూరుతో కలిపి చూడాలి: సీఎం చంద్రబాబు

రాజధాని పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష

స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా పనిచేయాలని సూచన

పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం

ఆర్థిక సమస్యలు ఉండవని, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

ఇకపై క్షేత్రస్థాయిలో తానే స్వయంగా పనులను పర్యవేక్షిస్తానని వెల్లడి



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# అమరావతి అంటే ఆ 29 గ్రామాలే కాదు..



రాజధాని అమరావతిని కేవలం 29 గ్రామాల సముదాయంగా మాత్రమే చూడరాదని, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుకొని ఒక బృహత్ ప్రణాళికగా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ రెండు నగరాల్లోనూ మౌలిక వసతుల ప్రాజెక్టులను రాజధానికి అనుసంధానంగా అభివృద్ధి చేసినప్పుడే సమగ్ర రాజధాని రూపుదిద్దుకుంటుందని ఆయన అన్నారు. మంగళవారం సచివాలయంలో రాజధాని నిర్మాణ పనులపై సీఆర్డీఏ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణ పనులను 'స్పీడ్, క్వాలిటీ, డెలివరీ' లక్ష్యంగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. గతంతో పోల్చితే పనుల్లో వేగం కొంత పెరిగినప్పటికీ, అది ఏమాత్రం సరిపోదని, మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున ఆర్థికంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నామని, కాబట్టి పనుల్లో ఎక్కడా జాప్యం జరగడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. రాజధాని నిర్మాణం వంటి గొప్ప అవకాశం దక్కినందుకు కాంట్రాక్టు సంస్థలు దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజధానిలో రూ. 50,999 కోట్ల విలువైన 95 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, నెలకు కనీసం 7.92 శాతం చొప్పున పనులు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. భూసేకరణ, నిధుల సమీకరణ, అనుమతులు, డిజైన్ల వంటి కీలకమైన అంశాల్లో అన్ని ప్రభుత్వ శాఖలు, ఉన్నతాధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్ల నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపుపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిని ఇకపై తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పలువురు ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలను సమీక్షిస్తామన్న సీఎం

## హైడ్రా అనేది ప్రభుత్వం తెచ్చిన అతిపెద్ద సంస్కరణ అని వెల్లడి

## ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ



హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను తక్షణం విధుల నుంచి తప్పించాలంటూ హైకోర్టు వెలువరించిన ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ ఉత్తర్వులను సమీక్షిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రా కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని, ఆ సంస్థను మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా అనేది తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అతిపెద్ద సంస్కరణ అని అభివర్ణించారు. ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ, సోషల్ మీడియా వేదికగా ఏజెన్సీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. "బతుకమ్మ కుంటను ఆక్రమించింది పేదలా లేక పెద్దలా? ఒక బీఆర్ఎస్ నేత అక్కడ 10 ఎకరాలు కబ్జా చేశారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? గండిపేట చెరువు వద్ద కూల్చివేసినవి సామాన్యుల నిర్మాణాలా?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. కబ్జాదారులను రక్షించేందుకు భారీగా నిధులు వెచ్చిస్తూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్ కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులు ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హైడ్రా విషయంలో ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది ప్రభుత్వ విచక్షణాధికారమని ఆయన పేర్కొన్నారు. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లోనే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

# బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా: రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

**హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలన్న హైకోర్టు**

**హైకోర్టు ఆదేశాలు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్న కేటీఆర్**

**హైడ్రా పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ**

**కాంగ్రెస్ నేతల నివాసాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్న**



హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుంటోందని, హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని ఆయన విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, బిల్డర్లను, సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు వసూలు చేయడానికే హైడ్రాను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. అధికార పక్షానికి చెందిన వారి ఆస్తుల జోలికి వెళ్లడం లేదని, ఇదే నిజమైతే ముఖ్యమంత్రి సోదరుడి అక్రమ కట్టడాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశంలో ఏ అధికారి అయినా 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా రేవంత్ రెడ్డికి వేటకుక్కలా మారిందని, దీనిని అడ్డుపెట్టుకుని బిల్డర్ల వద్ద 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సోదరుడి నివాసంతో పాటు కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, మహేందర్ రెడ్డి, కేవీపీల అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చివేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో కలిపేస్తామని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కూడా కేటీఆర్ స్పందించారు. ఈ ఉదంతంతో దేశ యువత మొదటిసారిగా మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన అసమర్థతతో సరైన మద్దతు ఇవ్వలేకపోవడంతో, విద్యార్థులే నేరుగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం వచ్చినప్పుడు యువత తప్పకుండా స్పందిస్తుందని కేసీఆర్ గతంలోనే చెప్పారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్ పేపర్ మూడుసార్లు లీక్ అయిందంటూ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

# మంత్రి పదవికి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలి: రోజా

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెకండ్ గేట్ వద్ద వైసీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో రోజా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరు చెప్పి నిరుద్యోగులను మోసం చేస్తూ దీనిని 'దగా డీఎస్సీ'గా మార్చేసిందని ఆమె ఆరోపించారు. జీవో 420 జారీ చేసి అర్హత లేని దాదాపు 427 మందికి అక్రమంగా పోస్టులు కట్టబెట్టారని, పరీక్షల నిర్వహణలో తీవ్ర అక్రమాలు జరిగాయని రోజా విమర్శించారు. డీఎస్సీ స్కామ్‌పై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు బాధ్యత వహిస్తూ నారా లోకేశ్ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లోకేశ్ దిగిపోయే వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. రూ. 7 వేల కోట్ల బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందని రోజా ధ్వజమెత్తారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే బొండా ఉమ మంత్రి పదవి కోసం లాబీయింగ్ చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం కేవలం తమ అనుకూల ప్రచార పత్రికలను కాపాడుకోవడంలో మునిగి తేలుతోందే తప్ప... మహిళల రక్షణను, నిరుద్యోగుల భవిష్యత్తును పూర్తిగా గాలికొదిలేసిందని మండిపడ్డారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## తెలంగాణ టీవీ అవార్డులకు పీవీ పేరు?.. మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ : తెలంగాణలో టెలివిజన్ రంగానికి ప్రత్యేక గుర్తింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బుల్లితెర కళాకారులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిం చేలా టెలివిజన్ అవార్డులను ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవ ంతమైంది. ఈ అవార్డులకు మాజీ ప్రధాని పీవీ నరసిం హారావు పేరు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సినిమా టోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడిం చారు. టెలివిజన్ అవార్డు కమిటీ ప్రతినిధులతో మంత్రి సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అవార్డుల లోగో, కేటగిరీలు, పేరుపై విస్తృతంగా చర్చిం చారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మను ప్రతిబింబించేలా లోగో, పేరు ఉండాలని మంత్రి సూచించారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరును అవార్డులకు పెట్టే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ అంశంపై ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత తుది నిర్ణ యం తీసుకుంటామని చెప్పారు. అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. అందుకు అవసరమైన సమగ్ర మార్గదర్శకాలను త్వరగా సిద్ధం చేయాలని టెలివిజన్ అవార్డు కమిటీ సభ్యులకు ఆదేశించారు.

## హైదరాబాద్ పోలీసుల అదుపులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి!

గుర్తించిన పోలీసులు, అనంతరం హైదరాబాద్‌లోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్ శివరాంపల్లిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 18న అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. శిక్షణ సమయంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధించాడని, దాడికి పాల్పడటంతో పాటు వెంబడించి బెదిరించాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు తెలియకుండా ప్రైవేట్ వీడియోలు తీసి, వాటిని తన భర్తకు పంపి బ్లాక్ మెయిల్ చేశారని కూడా ఆమె ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద లైంగిక వేధింపులు, దాడి, వెంబడించడం, అక్రమ నిర్బంధం, క్రిమినల్ బెదిరింపులతో పాటు ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం ఈ కేసు దర్యాప్తును హైదరాబాద్ ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోంది. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఉదయ్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, ఆయనకు మధ్యంతర రక్షణ కల్పించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. మరోవైపు, తాను పరారీలో లేనని, అనారోగ్యంతో ఉన్న తన నానమ్మను చూసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఊళ్లపాలెం గ్రామానికి వెళ్లానని ఉదయ్ రెడ్డి మీడియాకు తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవమని, విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో నమోదైన సెక్షన్లు, లభ్యమైన ఆధారాల ప్రకారం పారదర్శకంగా దర్యాప్తు జరుపుతామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. అన్ని కోణాల్లోనూ విచారణ చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

# పార్టీ లైన్ దాటలేదు..

ఆదేశాలే తనకు శిరోధార్యమని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలోని కొన్ని దుష్ట శక్తులు కావాలనే తన మాటలను, అక్కడ జరిగిన సంఘటనను వక్రీకరించి దుష్ప్రచారం చేశాయని ఆయన ఆరోపించారు.

**అసలేం జరిగిందంటే..**

ఈ నెల 25వ తేదీన గుంటూరులో దివంగత నేత ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ జరిగిందని, ఆ కార్యక్రమానికి కాపు జేఏసీ ఆహ్వానం మేరకు తాను వెళ్లానని బోండా ఉమా తెలిపారు. "అది పూర్తిగా రాజకీయాలకు అతీతమైన సంస్మరణ సభ. నేను ఉదయం 11 గంటలకు వెళ్లి, అక్కడ నివాళులు అర్పించి గంటలోపే, అంటే 12 గంటలకు తిరిగి వచ్చేశాను. నేను కూర్చున్న చోటుకే వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు వచ్చారు. ఆయన పలకరిస్తే నేను మాట్లాడాను. ఇది రహస్యంగానో, చాటుమాటుగానో జరిగింది కాదు. మీడియా అంతా అక్కడే ఉంది. బహిరంగ వేదికపైనే ఈ సంభాషణ జరిగింది. ఆ సభకు జనసేన, బీజేపీ, టీడీపీ, వైసీపీ సహా అన్ని పార్టీల నాయకులు హాజరయ్యారు" అని ఉమా వివరించారు.

**దుష్ట శక్తుల వక్రీకరణ వల్లే వివాదం**

ఒక చిన్న విషయాన్ని పట్టుకుని, దానిని వక్రీకరించి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేశారని బోండా ఉమా ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ వివాదం వెనుక కొన్ని దుష్ట శక్తులు ఉన్నాయి. పార్టీలో గ్యాప్ తేవాలనుకునే వారు ఇలాంటి ప్రచారాలు చేస్తుంటారు. నేను అనని మాటలను కూడా అన్నట్లుగా కొన్ని టీవీ ఛానెళ్లలో ప్రసారం చేశారు. నేను ఆరోజు ఉదయం 12 గంటలకు గుంటూరు నుంచి వచ్చేస్తే, ఆ తర్వాత రోజంతా నా పేరుతో స్టేట్‌మెంట్లు ఎలా వచ్చాయి? ఇదంతా నాపై, పార్టీపై జరుగుతున్న కుట్రలో భాగమే" అని ఆయన ఆరోపించారు.

**పార్టీకి, చంద్రబాబుకు ఎప్పుడూ విధేయుడినే**

తాను 25 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఉన్నానని, ఏనాడూ పార్టీ గీత దాటలేదని బోండా ఉమా ఉద్ఘాటించారు. "2019 నుంచి 2024 మధ్య కాలంలో ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పనిచేశాం. మాచర్ల, గుడివాడ ఘటనలైనా, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగినా పార్టీని కాపాడుకోవడానికి ముందున్నాం. చంద్రబాబు ఆదేశాలను, ఆయన ఉద్దేశాలను ధిక్కరించే ఆలోచన నాకు కలలో కూడా రాదు, రాబోదు. ఈ విషయంపైనే కమిటీకి సమగ్రంగా వివరించాను" అని ఆయన తెలిపారు. జరిగిన సంఘటన వల్ల పార్టీకి ఏదైనా నష్టం వాటిల్లిందా అనే కోణంలో అధిష్ఠానం వివరణ కోరిందని, వాస్తవాలను వారికి తెలియజేశానని చెప్పారు.

## శివరాజ్ సింగ్ చౌహాన్‌తో రేవంత్ భేటీ..

'ప్రధాని ఆవాస్ యోజన – గ్రామీణ్' 2.0 కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కోరారు. అదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చి, దానిద్వారా లబ్ధిదారులకు 90 రోజుల పాటు పని కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల వల్ల దెబ్బతింటున్న గ్రామీణ కుటుంబాలను, రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకం పరిధిని విస్తరించాలని రేవంత్ రెడ్డి కోరారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల పెంపకం, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణాలతో పాటు భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులను ఈ పథకం కింద అనుమతించాలని కోరారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ భూముల పునరుద్ధరణ పనులను కూడా ఇందులో చేర్చి, రైతాంగానికి, గ్రామీణ ఉపాధి రంగానికి కేంద్రం తగిన సహాయసహకారాలు అందించాలని విన్నవించారు.

### అమెరికాలో మరో రోడ్డు ప్రమాదం..

## తెలంగాణ మహిళ దుర్మరణం

**న్యూజెర్సీ రోడ్డు ప్రమాదంలో దీపారెడ్డి అనే మహిళ మృతి**

**కారు సిగ్నల్ వద్ద వేచి ఉన్న సమయంలో వెనకనుంచి ఢీకొన్న మరో కారు**

**దీపారెడ్డిది రంగారెడ్డి జిల్లా ఆకుతోటపల్లి గ్రామం**



అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్రీపతి దీపారెడ్డి (44) దుర్మరణం చెందారు. ఆమె రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్ మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందినవారు. దీపారెడ్డి తన భర్త రామకృష్ణారెడ్డితో కలిసి న్యూజెర్సీలో నివాసముంటున్నారు. దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. వీరు ప్రయాణిస్తున్న కారు సిగ్నల్ వద్ద వేచి ఉన్న సమయంలో, వేగంగా వచ్చిన మరొక వాహనం వీరి కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దీపారెడ్డి ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. సంతోషంగా జీవిస్తున్న కుటుంబంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం అలముకోవడంతో స్వగ్రామం ఆకుతోటపల్లిలోనూ, బంధువుల్లోనూ విషాదం నెలకొంది. ఈ ప్రమాదంపై న్యూజెర్సీ స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దీపారెడ్డి భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకవచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### తెలంగాణలో ఏర్పడేది

## డబుల్ ఇంజిన్ సర్కారే: రాంచందర్‌రావు



తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శు భపరిణామమని, చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి చేరుతుండటం మార్పుకు సంకేతమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన... అనేక దేశాలు క్రిస్టియన్, ముస్లిం దేశాలుగా మారినా సనాతన ధర్మాన్ని ఏ శక్తీ నిర్మూలించలేకపోయిందని అన్నారు. ప్రస్తుతం యువజన ఉద్యమాల ముసుగులో విదేశీ నిధులు సేకరిస్తూ దేశాన్ని విభజించేందుకు కొన్ని కుట్రలు సాగుతున్నాయని, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రతి పదేళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ మాత్రమేనని, దీనిని అడ్డుపెట్టుకుని అనవసర భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని హెచ్చరించారు.

# పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

- వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఎంపీఓ ఆదేశం
- విచారణలో వెలుగుచూసిన నిబంధనల ఉల్లంఘనలు..
- వివరణ సంతృప్తికరంగా లేకపోతే తదుపరి చర్యలు

**తొలివెలుగు, రాజాపేట :** మండల పరిధిలోని బొందుగుల గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు విధుల్లో నిర్లక్ష్యం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) ఆవుల కిషన్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. గ్రామ సర్పంచ్‌తో పాటు పంచాయతీ సిబ్బంది చేసిన ఫిర్యాదులను జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించడంతో, వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. గ్రామపంచాయతీ వ్యవహారాలకు సంబంధించిన పలు అంశాల్లో కార్యదర్శి విధి నిర్వహణపై గ్రామస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమవడంతో పాటు, అధికారిక విధానాలను పాటించలేదనే ఆరోపణలు జిల్లా అధికారుల దృష్టికి వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఎంపీఓ ఆవుల కిషన్ బొందుగుల గ్రామాన్ని సందర్శించి, సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేసి పలు రికార్డులను పరిశీలించారు. విచారణలో కార్యదర్శి కొన్ని అంశాల్లో ప్రభుత్వ నిబంధనలు, పరిపాలనా మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ, ఆరోపణలపై వారం రోజుల వ్యవధిలో పూర్తి స్థాయి లిఖితపూర్వక వివరణ సమర్పించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా సమాధానం ఇవ్వకపోయినా, లేదా సమర్పించే వివరణ సంతృప్తికరంగా లేకపోయినా, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉందని ఎంపీఓ ఆవుల కిషన్ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ పరిణామం మండల పరిధిలోని గ్రామపంచాయతీల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

# కొత్తజాలలో మొక్కల పంపిణీ

- హరితహారానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి : సర్పంచ్ ఠాగూర్ లావణ్య ధర్మేందర్ సింగ్



**తొలివెలుగు, రాజాపేట :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఇంటా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కొత్తజాల గ్రామ సర్పంచ్ ఠాగూర్ లావణ్య ధర్మేందర్ సింగ్ అన్నారు. మంగళవారం రాజాపేట మండలంలోని కొత్తజాల గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, రైతులకు ఆరు రకాల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇంటి ఆవరణలు, వ్యవసాయ పొలాల గట్లు, ఖాళీ ప్రదేశాల్లో ఈ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని పెద్ద చెట్టుగా పెంచాలని కోరారు. గ్రామాన్ని మరింత పచ్చదనంతో నింపేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిరంతరం హరిత కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు గ్రామ ప్రజలు పూర్తి సహకారం అందించాలని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలతోనే లాభసాటి వ్యవసాయం

- ఎల్ నినో ప్రభావంతో తగ్గిన వర్షపాతం
- నీటి లభ్యత బట్టే సాగు నిర్ణయించాలి
- అదనపు కలెక్టర్ భాస్కరరావు సూచన

**తొలివెలుగు, రాజాపేట:** ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం గణనీయంగా తగ్గినందున రైతులు ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తెలిపారు. మంగళవారం రాజాపేట రైతువేదికలో నిర్వహించిన విత్తన మేళా, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటూ తక్కువ నీటి అవసరమున్న జొన్నలు, పెసలు, మినుములు, కంది, ఆముదం వంటి పంటలను సాగు చేయాలన్నారు. సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాజాపేట మండల 2026-27 వ్యవసాయ సమాచార వివరాల ప్రత్యేక పుస్తకాన్ని ఏడీఏ పద్మజ ఆవిష్కరించగా, దానిని పరిశీలించిన అదనపు కలెక్టర్ అభినందించారు. అనంతరం రైతులు మన్నె రాములు, బెడిద కృష్ణలను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సదస్సులో వ్యవసాయ శాఖ మంత్రి సందేశాన్ని టెలికాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వినిపించారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఏడీఏ పద్మజ, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, రేణికుంట పీఏసీఎస్ ఛైర్మన్ నమిల మహేందర్ గౌడ్, ఎంపీడీవో నాగవేణి, ఏఈవోలు అంజయ్య, ప్రణీత, నవ్యత, భవ్యత తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలల్లో నాణ్యమైన విద్య రుచికరమైన భోజనం అందించాలి





- కొలనుపాక జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- విద్యార్థులతో ముచ్చటించి, భవిష్యత్ లక్ష్యాలపై ఆరా

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/ఆలేరు :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరును ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతా ప్రమాణాలపై అధికారులను ఆరా తీశారు. పాఠశాలలో మరుగుదొడ్లను స్వయంగా పరిశీలించి, నిరంతరం నీటి సరఫరా ఉండేలా చూసుకోవాలని, ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. తొమ్మిదో తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. భవిష్యత్తులో ఏ స్థాయికి చేరుకోవాలనుకుంటున్నారో అడిగి తెలుసుకుని, ఉన్నత లక్ష్యాల సాధనకు కష్టపడి చదవాలని సూచించారు. క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలోని 'అటల్ టింకరింగ్ ల్యాబ్' (కంప్యూటర్ ల్యాబ్)ను పరిశీలించి డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించేలా తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాలలో మౌలిక వసతులు, నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆకుల వేణుగోపాల్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, కరుణాకర్, రవీందర్, శ్వేత, శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల వైవిధ్యీకరణతోనే లాభసాటి వ్యవసాయం





- పల్లెర్ల రైతువేదికలో 100వ 'రైతు నేస్తం', విత్తన మేళా
- ఎల్‌నినో ప్రభావాలపై రైతులకు అవగాహన

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల వైవిధ్యీకరణ పాటించాలని మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) ఎస్.శ్రీనివాసులు సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల రైతు వేదికలో మంగళవారం ఘనంగా నిర్వహించిన 100వ ఎపిసోడ్ 'రైతు నేస్తం' కార్యక్రమం, ప్రత్యామ్నాయ పంటల అవగాహన సదస్సు, విత్తన మేళాలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఏఓ మాట్లాడుతూ... వర్షపాతం తగ్గుతున్న దృష్ట్యా ఒకే పంటపై ఆధారపడకుండా తక్కువ నీటితో పండే కంది, పెసర, మినుము వంటి పప్పుధాన్యాలు, ఆముదం, నువ్వులు, కూరగాయల సాగు చేపట్టాలన్నారు. ఏఈవో ఎం.అశోక్ కుమార్ మాట్లాడుతూ... నేల స్వభావం, నీటి లభ్యతను బట్టి పంటలు ఎంచుకోవాలని, వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు ప్రయోజనకరమని వివరించారు. అనంతరం రైతులకు నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాలను అందజేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి, ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, ఏఈవోలు రాజశేఖర్, క్రాంతి కుమార్, సౌమ్య, రైతులు జంగా రవి, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, వెంకన్న, ఆనంద్ , రాజు పాల్గొన్నారు.

# ఘనంగా గంగుల వెంకట రాజిరెడ్డి జన్మదిన వేడుకలు




- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు
- ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

**తొలివెలుగు, రామన్నపేట:** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, పల్లివాడ మాజీ సర్పంచ్ గంగుల వెంకట రాజిరెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సుభాష్ సెంటర్‌లో ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజిరెడ్డి ప్రజా సేవలో ముందుంటూ, పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మంత్రులను కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకుడు ఇంజ మహేష్

- యాదాద్రి స్వామివారి ప్రసాదం అందజేత
- జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యలపై వినతిపత్రం సమర్పణ





**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం కాలపల్లి గ్రామానికి చెందిన ఐఎన్‌టీయూసీ (ఐఎన్‌టీయూసీ-327) యాదాద్రి భువనగిరి జిల్లా కోశాధికారి ఇంజ మహేష్ మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లను కలిసి శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వాదాలను పంచుకున్నారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లాలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి దామోదర రాజనర్సింహ సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఇంజ మహేష్ వెల్లడించారు. అలాగే ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు ఇంజ మహేష్‌ను ఆప్యాయంగా అభినందించగా, యాదాద్రి స్వామివారి ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని, జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు తన వంతు సహకారం అందిస్తానని ఇంజ మహేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గంధమాల నవీన్, పరదే కల్యాణ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలు పరిష్కరించాలి

- డిప్యూటీ తహసిల్దార్‌కు సీపీఎం వినతిపత్రం
- పీహెచ్‌సీల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్

**తొలివెలుగు, వలిగొండ:** మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), పల్లె దవాఖానాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ తహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ... వలిగొండ, వేములకొండ, వర్కట్‌పల్లి, వేల్వర్తి పీహెచ్‌సీలతో పాటు రెడ్లరేపాక, పులిగిల్ల, అరూర్ గ్రామాల పల్లె దవాఖానాల్లో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వలిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మార్చి 24 గంటల వైద్య సేవలు అందించాలని కోరారు. వేములకొండ ఆసుపత్రి ప్రహరీ గోడ కూలిపోవడంతో భద్రత కొరవడిందని, తక్షణమే నూతన గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. వేల్వర్తి పీహెచ్‌సీకి గెజిటెడ్ హోదా కల్పించి రెగ్యులర్ వైద్యుడిని నియమించాలని, వర్కట్‌పల్లి పీహెచ్‌సీలో రెండో మెడికల్ ఆఫీసర్‌ను వేయాలని పేర్కొన్నారు. పులిగిల్ల, రెడ్లరేపాక పల్లె దవాఖానాలకు నూతన భవనాలు నిర్మించి, మండలంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూర శ్రీనివాస్, మోగిలిపాక గోపాల్, గాజుల ఆంజనేయులు, గర్దాసు నరసింహ, కొండూరు సత్తయ్య, ఉండ్రాటి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## చేనేత పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా చేనేత ఏడీ శ్రీనివాస్‌కు ఘన సన్మానం
- మర్యాదపూర్వకంగా కలిసిన వెంకటరమణ సిల్క్ సొసైటీ సభ్యులు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి అధికారుల తరఫున పూర్తిస్థాయిలో కృషి చేయాలని జిల్లా చేనేత సహాయ సంచాలకులు (ఏడీ) శ్రీనివాస్‌ను వెంకటరమణ సిల్క్ చేనేత ఉత్పత్తి, విక్రయ సంఘం ప్రతినిధులు కోరారు. పురపాలక కేంద్రంలోని వెంకటరమణ సిల్క్ సొసైటీ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు చింతకింది రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం కార్యవర్గ సభ్యులు భువనగిరిలోని జిల్లా చేనేత కార్యాలయంలో ఏడీ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏడీని శాలువాతో ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికులు, సొసైటీల పురోగతికి తగిన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సుంకి సుదర్శన్, ఉపాధ్యక్షుడు గుద్దేటి నరసింహ, కార్యవర్గ సభ్యులు కొండ వెంకటేష్, సుంకి సాంబయ్య, గణపురం వెంకటేష్, సామల వెంకటేష్, బింగి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితులపై ప్రజల్లో అవగాహన పెంచాలి

- తక్కువ నీటితో పండే పంటల వైపు దృష్టి సారించాలి
- మండల ప్రత్యేక అధికారి బి. సురేష్ సూచన

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ఎల్‌నినో ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎదురవుతున్న వర్షాభావ పరిస్థితులపై ప్రజలకు, రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి (డీఈఓ) బి. సురేష్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్పంచులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్‌నినో కారణంగా వర్షపాతం తగ్గి కరువు పరిస్థితులు దాపురిస్తున్నాయని, ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా చైతన్యపరచాలన్నారు. ప్రతి ఇంట్లోనూ, గ్రామంలోనూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని సంరక్షించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ ప్రత్యేక అధికారి (డిప్యూటీ సీఈఓ) చిలుకూరి శ్రీనివాస్, ఎంపీడీవో విజయం, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# పొనకల్ మార్కెట్‌లో 'గో'ల!

- దుకాణాలపై పడి సరుకులు నాశనం చేస్తున్న పశువులు
- రహదారిపైనే మార్కెట్ నిర్వహణతో ట్రాఫిక్ కష్టాలు
- పట్టించుకోని పంచాయతీ యంత్రాంగం.. చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్






**తొలివెలుగు, జన్నారం:** మండల పరిధిలోని పొనకల్ గ్రామంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంత వ్యాపారులు, కొనుగోలుదారులకు ఇబ్బందులకు కేంద్రంగా మారింది. మార్కెట్ ప్రాంగణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న ఆవులు, ఎద్దులు దుకాణాల వద్దకు చేరుకుని కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలను తినేయడంతో పాటు తొక్కి పాడుచేస్తుండటంతో వ్యాపారులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ప్రతి వారం ఇదే పరిస్థితి నెలకొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో వ్యాపారం చేయడంకంటే సరుకులను పశువుల నుంచి కాపాడుకోవడమే పెద్ద సవాలుగా మారిందని వ్యాపారులు చెబుతున్నారు. కొద్దిసేపు అజాగ్రత్తగా ఉన్నా పశువులు దుకాణాల్లోకి చొరబడి సరుకులను నాశనం చేస్తున్నాయని, దీనివల్ల పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొంటోందని వాపోతున్నారు. రోజంతా వ్యాపారం చేసేందుకు బదులుగా పశువులను తరిమికొట్టడానికే సమయం వెచ్చించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఇక మార్కెట్‌ను ప్రధాన రహదారిపైనే నిర్వహించడం మరో పెద్ద సమస్యగా మారింది. సంత రోజు రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కొనుగోలుదారులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు ఒకేసారి రావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. దీనికి తోడు పశువుల సంచారం పెరగడంతో తరచూ గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రత్యేకించి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, అత్యవసర పనులపై ప్రయాణించే ప్రజలు ఈ రద్దీ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడం, పశువులను నియంత్రించే చర్యలు చేపట్టకపోవడం వల్ల ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు పలుమార్లు సమస్యను గమనించినప్పటికీ శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వారాంతపు సంతకు అనువైన ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు. అలాగే మార్కెట్ రోజున పశువుల సంచారాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించడం, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పొనకల్ వారాంతపు సంతలో నెలకొన్న ఈ సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# జలసిరి పనులకు శ్రీకారం



- భూగర్భ జలాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- జనంపల్లిలో బోర్‌వెల్ రీఛార్జ్ పనులను ప్రారంభించిన ఎంపీడీఓ రాములు, సర్పంచ్ సరోజ

**తొలివెలుగు, రామన్నపేట:** భవిష్యత్ తరాలకు నీటి కొరత తలెత్తకుండా భూగర్భ జలాలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం జనంపల్లి గ్రామంలో ప్రభుత్వం వి.బి.జి రామ్‌జీ పథకం కింద చేపట్టిన 'తెలంగాణ జలసిరి' బోర్‌వెల్ రీఛార్జ్ పనులను మంగళవారం ఎంపీడీఓ రాములు, గ్రామ సర్పంచ్ సరోజ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం క్రమంగా తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమం ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేసి బోర్‌వెల్‌లలో నీటి నిల్వలు పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రతి గ్రామంలో నీటి సంరక్షణకు ప్రజలు భాగస్వాములు కావాలని, వర్షపు నీటిని వృథా కాకుండా భూగర్భ జలాల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జలసిరి పథకం ద్వారా చేపట్టే బోర్‌వెల్ రీఛార్జ్ పనులు రైతులకు, గ్రామ ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడతాయని, నీటి వనరుల పరిరక్షణలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామ సర్పంచ్ సరోజ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధితో పాటు సహజ వనరుల పరిరక్షణకు గ్రామపంచాయతీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జలసిరి పథకం ద్వారా భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి, తాగునీటి అవసరాలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రఫీ, ఏపీఓ వెంకన్న, ఈసీ ప్రవీణ్, టెక్నికల్ అసిస్టెంట్ సుచరిత, పంచాయతీ కార్యదర్శి అయ్యప్ప రెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నిర్ణీత సమయం దాటి టిఫిన్ సెంటర్ నిర్వహణ: యజమానికి 2 రోజుల జైలు

- రూ. 50 జరిమానా విధించిన కోర్టు
- ఎల్‌బీ నగర్ పోలీసుల చర్యలు



**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** అనుమతించిన సమయం దాటిన తర్వాత కూడా టిఫిన్ సెంటర్ నడుపుతున్న యజమానికి కోర్టు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష, రూ. 50 జరిమానా విధించింది. ఎల్‌బీ నగర్ పోలీసుల కథనం ప్రకారం... ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రామావత్ కిషన్ (43) టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. కాగా, ప్రభుత్వం అనుమతించిన సమయం దాటినా దుకాణాన్ని తెరిచి ఉంచడంతో పోలీసులు తనిఖీలు చేపట్టి కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని ఎల్‌బీ నగర్ 6వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, విచారణ జరిపిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిరంతరం నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీ నగర్ పోలీసులు హెచ్చరించారు.

## వర్తక, మెన్స్ వేర్ సంఘం అధ్యక్షుడిగా దోర్నాల బాలరాజు

- ఏకగ్రీవంగా లక్ష్మీనరసింహ సంఘం నూతన కమిటీ ఎన్నిక
- పోచంపల్లిలో సర్వసభ్య సమావేశం నిర్వహణ



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పురపాలక కేంద్రంలోని టై అండ్ డై ఫంక్షన్ హాల్‌లో మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహ వర్తక, మెన్స్ వేర్ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన మండల కార్యవర్గాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా మక్తల కృష్ణ, అధ్యక్షుడిగా దోర్నాల బాలరాజు, ఉపాధ్యక్షులుగా పి. ప్రవీణ్, రావుల సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎస్. శేఖర్, కోశాధికారిగా కందగట్ల ధనంజయ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా దోర్నాల సంతోష్, భువనగిరి సాగర్, వంగూరి విజయ, జిట్టల భాను, రుద్ర బాలసుబ్రమణ్యం, గర్దాసు ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, గంజి గోపాల్, విద్యాసాగర్, కే. సునీతలను ఎన్నుకున్నట్లు ప్రతినిధులు ప్రకటించారు.

# వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి





- ఎల్‌నినో ప్రభావంతో తగ్గనున్న వర్షపాతం
- రైతుల అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/ఆలేరు:** మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. మంగళవారం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని క్లస్టర్ రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గనున్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. నీటి లభ్యతను బట్టి అధిక నీరు అవసరమయ్యే వరికి బదులు జొన్నలు, పెసలు, మినుములు, కంది, ఆముదం వంటి పంటలను ఎంచుకోవాలన్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం ద్వారా లాభాలు పొందవచ్చని చెప్పారు. రైతు వేదికల్లో అందుబాటులో ఉన్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసేలా వ్యవసాయ అధికారులు సాంకేతిక సలహాలు, మార్కెటింగ్ సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రమణారెడ్డి, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

- దేవలమ్మ నాగారంలో ఘనంగా వన మహోత్సవం
- ప్రతి ఇంటికీ రెండు మొక్కలు నాటాలి: సర్పంచ్ గౌరి శ్రీనివాస్ గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** పర్యావరణ సమతుల్యతను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని దేవలమ్మ నాగారం గ్రామ సర్పంచ్ గౌరి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చేతుల మీదుగా గ్రామస్థులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఇంట్లోనూ కనీసం రెండు మొక్కలను నాటి, వాటిని ఏపుగా పెరిగేలా సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. మానవ మనుగడ పర్యావరణ పరిరక్షణతోనే సాధ్యమవుతుందని, పుట్టినరోజు లాంటి వేడుకల వేళ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని సూచించారు. అటవీ శాతాన్ని పెంచడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోగలమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ అమరావతి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ముప్పు.. జలసిరి పనులపై సమన్వయం



- వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ
- చౌటుప్పల్‌లో మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం

**తొలివెలుగు, చౌటుప్పల్:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని అధికారులు నిర్ణయించారు. భూగర్భ జలాల పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ, గ్రామాల్లో నీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన వి.బి.జి రామ్‌జీ జలసిరి పథకం అమలుపై మంగళవారం చౌటుప్పల్ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి పి. రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో జలసిరి పథకం కింద చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. గ్రామస్థాయిలో ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, ఫామ్ పాండ్స్ నిర్మాణం, బోర్‌వెల్ రీఛార్జ్ పనులు వేగంగా పూర్తి చేసి వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున ప్రతి గ్రామంలో నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తే భవిష్యత్తులో తాగునీటి సమస్యలతో పాటు వ్యవసాయ అవసరాలకు కూడా ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. పనుల అమలులో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జీపీ ఎస్ఏపీ (గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక) అమలుపై కూడా విస్తృతంగా చర్చించారు. గ్రామాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని, గ్రామాభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో అమలు చేయాలని సూచించారు. గ్రామపంచాయతీలు, ఉపాధి హామీ, వ్యవసాయ, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా జెడ్పీ సీఈఓ ఎన్. శోభారాణి మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో కె. శైలజ, తహసీల్దార్ వీరబాయి తమ శాఖల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి, పలు గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీవో, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ వీఓ కమిటీల సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.






# అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఎస్ఐఆర్ పరిశీలనలో వార్డు సభ్యుడు కొమ్ము రామస్వామి
- హరిజనవాడ కాలనీలో ప్రత్యేక సవరణ కార్యక్రమం

**తొలివెలుగు, రామన్నపేట:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని హరిజనవాడ కాలనీలో మంగళవారం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక వార్డు సభ్యుడు కొమ్ము రామస్వామి హాజరై ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, వివరాల్లో ఏవైనా మార్పులు లేదా తప్పులు ఉంటే సకాలంలో సరిచేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా అధికారులు నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్‌వో మేడి లలిత పాల్గొని దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన పత్రాలు, నమోదు, సవరణలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలనీ నివాసితులు అధిక సంఖ్యలో పాల్గొని తమ వివరాలను పరిశీలించుకున్నారు.

# నేడు చౌటుప్పల్‌లో ఎమ్మెల్యే రాజ్‌గోపాల్ రెడ్డి పర్యటన

- కొయ్యలగూడెంలో రామాలయ కమిటీ ప్రమాణస్వీకారం
- ముస్కు నరేందర్ రెడ్డి అంత్యక్రియలకు హాజరు

**తొలివెలుగు, చౌటుప్పల్:** మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి బుధవారం చౌటుప్పల్ మండలంలో పర్యటించనున్నారు. ఎమ్మెల్యే ముఖ్య సమాచారం ప్రకారం... ముందుగా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో నిర్వహించే శ్రీరామాలయం నూతన కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం చౌటుప్పల్ పట్టణ పరిధిలోని తంగడపల్లికి చేరుకుని, ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి మామగారు ముస్కు నరేందర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించనున్నారు.

# ఎస్ఐఆర్ పేరిట ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలి

- స్థానిక పరిశ్రమల్లో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డి




**తొలివెలుగు,చౌటుప్పల్:** ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన ఓటు హక్కును పరిరక్షించాలని, ఎస్ఐఆర్ పేరిట అర్హులైన ఓటర్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డి కోరారు. మంగళవారం చౌటుప్పల్‌లోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాగీరు కిష్టయ్య అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ?కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం గత 12 ఏళ్లలో యువతకు ఉద్యోగాలు ఇస్తామని, ఎస్సీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా, చట్టబద్ధంగా జరగాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని సూచించారు. చౌటుప్పల్ మండలంలోని పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో విస్తృత ప్రజాపోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, నాయకులు చీరిక సంజీవరెడ్డి, చింతల సుదర్శన్, అంతటి అశోక్, పొట్ట శ్రీనివాస్, పల్లె మధు కృష్ణ, జక్కిడి దేవేందర్ రెడ్డి, కొంతం సుశీల, లక్ష్మమ్మ, శ్రీశైలం, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు జాగ్రత్త.. అత్యవసర సాయానికి 100కు డయల్ చేయండి..!

హైదరాబాద్‌లో వరసగా మూడో రోజు భారీ వర్షం కురిసింది. వాన దంచకొట్టడంతో నగరంలోని రోడ్లు, పలు లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. రోడ్లపై భారీగా నీరు చేరడంతో చాలా చోట్ల ట్రాఫిక్ స్తంభించింది. దాంతో, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీళ్లు నిలిచిన చోట ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు. ప్రమాదాలకు అస్కారం ఉన్నందున వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని, అత్యవసర సాయానికి 100కు డయల్ చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ (ఞూ ఖఞయిఖుఖుతీ) కోరారు. రాష్ట్ర రాజధానిలో వర్షం దంచికొట్టింది. నగరంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజగుట్ట, అల్వాల్, అమీర్‌పేట, హైటెక్ సిటీ, ఐకియా, మాదాపూర్, కేపీహెచ్‌బీ, చాదర్‌ఘట్, మలక్‌పేట, కార్ఖానా, తిరుమలగిరిలో వాన జోరుగా పడింది. దాంతో, ఆఫీసులో విధులు ముగించుకొని ఇళ్లకు బయల్దేరిన వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కున్నారు. రోడ్లపై వాన నీరు భారీగా చేరడంతో.. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



# భూగర్భ జలాల సంరక్షణకే కమ్యూనిటీ ఇంకుడుగుంతలు

- అల్లాపురంలో పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్
- నీటి సంరక్షణలో గ్రామస్థులు భాగస్వాములు కావాలి

**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో భూగర్భ జలాల పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ లక్ష్యంగా చేపట్టిన కమ్యూనిటీ ఇంకుడుగుంత నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి, ఉపసర్పంచ్ బోయిని లింగస్వామి హాజరై పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుందని, భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తగ్గడంతో పాటు వ్యవసాయ అవసరాలకు మేలు జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న నీటి సంరక్షణ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేసి దీర్ఘకాలిక ప్రయోజనాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు యంజాల శ్రీకాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్, కారోబార్ సాయి, జీపీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పైసలకైతే మాకొద్దు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లను ఉచితంగా నిర్మించి ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిరుపేదల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నది. కేసీఆర్ ఇండ్లను ఉచితంగా ఇస్తే.. రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల పేరిట సింగిల్ బెడ్రూం ఇంటికే రూ.6 లక్షలు వసూలు చేస్తామనటంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అప్లికేషన్‌కు రూ.100, టోకెన్ అమౌంట్ పేరిట రూ.10 వేలు చెల్లించాలని ప్రకటిస్తూ పేదోడు కనీసం దరఖాస్తు కూడా చేసుకోకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గ్రేటర్ హైదరాబాద్ బస్తీలు, మూసీ పరీవాహక ప్రాంతా ల్లో నివసిస్తున్న నిరుపేదలను గుర్తించి వాళ్లున్న ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇస్తామని ప్రకటనలు చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు వారితో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు సిద్ధమవుతున్నది. కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్‌లోని నిరుపేదలు ప్రభుత్వం ప్రీలాంచ్ విధానంలో తీసుకొస్తున్న రూ.6 లక్షల ఇందిరమ్మ ఇండ్లు అసలే వద్దంటున్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. రూ.6 లక్షలుంటే తామే సొంతంగా ఇల్లు కట్టుకునేవాళ్లం కదా అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను రూ.6 లక్షలకు లాటరీ విధానంలో విక్రయిస్తామని ప్రకటించింది. ఆ ఇండ్ల కోసం అర్హులు మీసేవ కేంద్రంలో టోకెన్ అమౌంట్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కానీ నగరంలోని నిరుపేదలు తమకు ఇందిరమ్మ ఇండ్లు ఉచితంగానే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించినా ప్రజావాణికి పోటెత్తుతున్నారు. ప్రభుత్వం ప్రీలాంచ్ విధానం ప్రకటించకముందు హైదరాబాద్ కలెక్టరేట్ ప్రజావాణికి ప్రతి సోమవారం 500 నుంచి 1000 లోపు దరఖాస్తులు వచ్చేవి. కానీ రెండు వారాలుగా రెండు వేలకు పైగా దరఖాస్తులు అందుతున్నాయి. నగరంలో ఇంటి స్థలంలేని వారి నుంచి ఇప్పటి వరకు 35 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా ఇంటిస్థలం ఉన్నవారి నుంచి 6 వేల దరఖాస్తులు అందాయి. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే ఇందిరమ్మ ఇండ్లు ఉచితంగా ఇస్తారని నగర ప్రజలు భావిస్తున్నారు. తాము రూ.6 లక్షలు చెల్లించలేమని, ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తారనే ఆశతో వస్తున్నామని చెబుతున్నారు. పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం డబ్బులు ఉన్నోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు సిద్ధమవుతుండటంతో సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం నగరంలోని నిరుపేదలను దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే అన్ని రంగాల్లో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు పేదలే లక్ష్యంగా కొత్త దోపిడీకి తెరతీస్తున్నారు. కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగించే నిరుపేదలు రూ.6 లక్షలు ఎక్కడి నుంచి తీసుకొస్తారు. గత బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లను ఉచితంగా నిర్మించి ఇచ్చారు. కేసీఆర్ కట్టించిన ఇండ్లను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనర్హులకు, ఇతర జిల్లాల వాళ్లకు, కాంగ్రెస్ నేతల అనుచరులుకు పంచిపెడుతున్నారు.



# బడాబాబులకే ప్రాధాన్యం.. సామాన్యులకు జాప్యమా?

- జన్నారంలోని పలు బ్యాంకుల తీరుపై చిన్న వ్యాపారుల అసంతృప్తి
- రుణాల మంజూరులో పారదర్శకత పాటించాలని విజ్ఞప్తి
- సమగ్ర విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులకు స్థానికుల వినతి

**తొలివెలుగు, జన్నారం:** గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాల అభివృద్ధికి బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రధానమంత్రి ముద్ర యోజన, ఎంఎస్ఎంఈ, స్టాండ్-అప్ ఇండియా తదితర పథకాల ద్వారా యువత, మహిళలు, చిన్న వ్యాపారవేత్తలకు రుణాలు అందించి ఆర్థికంగా బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పలు బ్యాంకుల్లో రుణాల మంజూరు ప్రక్రియపై కొందరు చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి కోరుకునే యువత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. పెద్ద మొత్తంలో రుణాలు కోరే ఆర్థికంగా బలమైన వర్గాలు, ప్రభావశీల వ్యక్తుల దరఖాస్తులు తక్కువ సమయంలోనే పరిష్కారమవుతున్నాయని, అదే సమయంలో చిన్న మొత్తంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న సామాన్య ప్రజలు మాత్రం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై సంబంధిత బ్యాంకుల అధికారిక వివరణ అందుబాటులో లేదు.

**చిన్న రుణాలకు కఠిన నిబంధనలేనా?**

కిరాణా దుకాణాలు, టైలరింగ్ యూనిట్లు, మెకానిక్ షాపులు, పశుపోషణ, చిన్న పరిశ్రమలు, ఇతర స్వయం ఉపాధి రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించేందుకు లేదా విస్తరించేందుకు రుణాల కోసం బ్యాంకులను ఆశ్రయిస్తున్నామని పలువురు దరఖాస్తుదారులు చెబుతున్నారు. అయితే రుణ దరఖాస్తుల పరిశీలన సమయంలో ఆధార్, పాన్, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, సిబిల్ స్కోర్, భూ పత్రాలు, గ్యారంటీలు తదితర అనేక పత్రాలు సమర్పించాలని కోరుతున్నారని, అన్ని పత్రాలు సమర్పించిన తర్వాత కూడా వివిధ కారణాలు చూపుతూ ప్రక్రియను ఆలస్యం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. కొంతమంది దరఖాస్తుదారులు నెలల తరబడి బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ప్రతి సందర్శనలో కొత్త పత్రాలు కోరుతున్నారని వాపోతున్నారు. రుణం మంజూరవుతుందో లేదో స్పష్టత లేకపోవడంతో వ్యాపార ప్రణాళికలు కూడా దెబ్బతింటున్నాయని వారు చెబుతున్నారు.

**సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్:**

బ్యాంకింగ్ నిబంధనలు ప్రతి ఒక్కరికీ ఒకే విధంగా అమలు కావాలని, అర్హులైన దరఖాస్తుదారులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా బ్యాంకులు మరింత పారదర్శకంగా వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. కొంతమంది

### వివక్ష..? రుణాలు మంజూరుపై అసంతృప్తి




జన్నారంలోని బ్యాంకుల్లో రుణాల మంజూరుపై చిన్న వ్యాపారుల అసంతృప్తి
సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజల డిమాండ్

చిన్న వ్యాపారుల అభిప్రాయం ప్రకారం, రుణాల మంజూరులో పారదర్శకత మరింత పెరిగితే గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని, యువత ఉపాధి వైపు అడుగులు వేయడానికి ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొంటున్నారు.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి:**

ఈ నేపథ్యంలో జన్నారం మండలంలోని పలు బ్యాంకుల్లో ఇటీవల మంజూరైన రుణాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులు సమగ్ర సమీక్ష నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైతే సంబంధిత ఉన్నతాధికారులు రుణాల మంజూరు ప్రక్రియను పరిశీలించి, అర్హులైన ప్రతి దరఖాస్తుదారునికి నిబంధనల ప్రకారం సమాన అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడాలంటే రుణాల మంజూరు ప్రక్రియ పారదర్శకంగా, సమయపాలనతో సాగాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.






# దంచికొట్టిన వాన

ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం భాగ్యనగరాన్ని ముంచెత్తింది. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లు చెరువులయ్యా యి. ఎక్కడ చూసినా వరదనీరు వెల్లువెత్తింది. ఆఫీసులనుంచి ఇళ్లకు బయలుదేరే సమయం కావడంతో ప్రధాన రహదారులపై వాహనాలు బారులు తీరాయి. కుండపోత వర్షానికి కాలనీల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. రాజేంద్రనగర్‌లో ప్రారంభమైన వర్షం క్రమంగా నగరమంతా విస్తరించింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, ఖైరతాబాద్, లక్డీకాపూ ల్, నాంపల్లి, కోఠి, బేగంపేట్, సికింద్రాబాద్, మ ణికొండ, గచ్చిబౌలి, మాదాపూర్,హైటెక్‌సిటీ, కొం పల్లి, ఓల్డ్‌సిటీ, అంబర్‌పేట, కాచిగూడ మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్య పురి, కొత్తపేట, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ తదితరప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లాయి. ముషీరాబాద్‌లో అత్యధికంగా 31 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణశాఖ తెలిపింది. వర్షంతో పాటు ఈదురుగాలులు కూడా వీచడంతో పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడడంతో రాకపోకలకు ఆటంకమేర్పడింది. ట్రాఫిక్ సమస్యతో చాలామంది మెట్రోను ఆశ్రయించగా మెట్రోరైళ్లు, స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. మహానగరాన్ని భారీ వర్షం కుదిపేసింది. సాయంత్రం నుంచి రాత్రి దాకా కురిసిన భారీ వర్షంతో కాలనీలన్నీ నీట మునిగాయి. రోడ్లన్నీ నదులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయయ్యాయి. నాలాలు, మ్యాన్‌హోళ్లు ఉప్పొంగి మురుగు ఏరులై పారింది. పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముషీరాబాద్, షేక్‌పేట, తిరుమలగిరి, ఖైరతాబాద్, బాలానగర్, శేరిలింగంపల్లి, అమీర్‌పేట, కూకట్‌పల్లి ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు నదులను తలపించాయి. +వశీస్త్రతీఖజూష్త్రఱఎ =వటవతీవఅఎవ

సాయంత్రం హఠాత్తుగా కుండపోత వర్షం కురియడంతో ఇళ్లకు వెళ్లడానికి ఆఫీసుల నుంచి బయటకువచ్చిన ఉద్యోగులు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్‌లతో ప్రధానకూడళ్లన్నీ నిండిపోయాయి. కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకుని నత్తనడకన కదలడంతో ఉద్యోగులు, ప్రయాణికులు గంటలతరబడి రోడ్లపైనే ఉన్నారు. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ప్రాంతాల్లో కిలోమీటర్ దూరం ముందుకుసాగడానికి సుమారు పదిహేను నుంచి ఇరవై నిముషాల సమయం పట్టిందని వాహనదారులు చెప్పారు. చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట రైల్వే అండర్‌పాస్ వరకు నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. ఎస్‌ఆర్‌నగర్ ఆర్‌యూబీ వద్ద నీళ్లు నిలిచిపోవడంతో వాహనాలు చాలా నెమ్మదిగా ముందుకు కదిలాయి. హైదర్‌గూడ పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే ఫ్లైఓవర్‌కింద కొన్ని పిల్లర్ల వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆ మార్గమంతా ట్రాఫిక్ జామ్ అయింది. కోఠిలో రహదారులపై నీరు చేరి ట్రాఫిక్ జామ్ అవడంతో ట్రాఫిక్‌లో అంబులెన్స్ చిక్కుకుంది.నగర ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు అత్యవసర హెచ్చరికలు జారీ చేశారు. వర్షం కారణంగా ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నదని, వాహనదారులు, నగరవాసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ప్రయాణం తప్పనిసరి అయితే వాహనాలను నెమ్మదిగా నడపాలని చెప్పారు. సోషల్‌మీడియా వేదికల ద్వారా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అందిస్తున్న హెచ్చరికలు ఎప్పటికప్పుడు అనుసరించాలని వారు కోరారు. డీఆర్‌ఎఫ్, మాన్‌సూన్ టీమ్స్, ట్రాఫిక్‌పోలీసులు రంగంలోకి దిగి సహాయకచర్యలు చేపట్టారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో డ్రైనేజీలు శుభ్రం చేస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించే ప్రయత్నం చేశారు.

# భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ, జూలై 28 : బంగారం, వెండి ధరలు ఒక్కరోజులో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. సోమవారం భారీగా పెరిగిన ధరలు ఆ మరుసటి రోజూ అంతేస్థాయిలో కిందికి పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పడిపోవడం, రూపాయి పుంజుకోవడం ధరలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఫలితంగా న్యూ ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.2,640 తగ్గి రూ.1.47 లక్షలకు దిగొచ్చింది. అంతకుముందు రూ.1, 49,640గా ఉన్నదని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. బంగారంతో పాటు వెండి ధరలు భారీగా దిగొచ్చాయి. కిలో వెండి ఏకంగా రూ.5,200 తగ్గి రూ.2,24, 800గా నమోదైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా పెరగడంతో మదుపర్లు తమ పెట్టుబడులను అతి విలువైన లోహాల నుంచి ఈక్విటీల వైపు మళ్లించడంతో వీటి ధరలు తగ్గుముఖం పట్టాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఔన్స్ గోల్డ్ ధర 53.40 డాలర్లు లేదా 1.31 శాతం తగ్గి 4,023.50 డాలర్లకు పరిమితమవగా, వెండి 2 శాతం దిగి 57.24 డాలర్లుగా ఉన్నది.



# జీడీపీ బాగా తగ్గొచ్చు: రాయిటర్స్ సర్వే

బెంగళూరు, జూలై 28 : దేశ ఆర్థిక వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) గణనీయంగా పడిపోవచ్చని రాయిటర్స్ పోల్‌లో తేలింది. గత ఆర్థిక సంవత్సరం (2025-26) భారత జీడీపీ ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ.. ఈసారి మాత్రం మందగించిన పెట్టుబడులు, పెరుగుతున్న చమురు ధరలతో ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయాలను మెజారిటీ ఎకనామిస్టులు వ్యక్తం చేయడం గమనార్హం. వచ్చే ఆర్థిక సంవత్సరం (2027-28) కూడా వృద్ధిరేటు ఆశించిన స్థాయిలో ఉండదని చెప్తుండటం.. ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. ఓవైపు ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్లు క్షీణిస్తున్నాయని, మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విజృంభిస్తున్నాయని ఎక్స్‌పర్ట్స్ గుర్తుచేస్తున్నారు. దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో పెరిగే క్రూడాయిల్ రేట్లు.. ఎకానమీ వృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయని చెప్తున్నారు. అదుపు తప్పుతున్న ద్రవ్యోల్బణం, మార్కెట్‌లో పడిపోతున్న డిమాండ్, దిగజారుతున్న వినియోగదారుల కొనుగోలు



శక్తి.. అన్నీ ప్రతికూల సంకేతాలుగానే పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ 6.6 శాతంగానే ఉండొచ్చని రాయిటర్స్ పోల్‌లో అంచనా. వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా 6.8 శాతంగానే ఉండొచ్చని అంటున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం 7.7 శాతంగా ఉన్నది.

# 5జీ, బ్రాడ్‌బ్యాండ్ సేవలు.. జియో టాప్!

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో రిలయన్స్ జియో తన మార్కెట్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసుకుంది. జూన్ 2026కు సంబంధించిన భారత టెలికాం నియంత్రణ సంస్థ విడుదల చేసిన తాజా సబ్‌స్క్రైబర్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. తాజా గణాంకాల ప్రకారం.. వైర్‌లైన్ బ్రాడ్‌బ్యాండ్, 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఫీఔూ), అలాగే యాక్టివ్ వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల పెరుగుదలలో జియో అగ్రస్థానాన్ని కొనసాగిస్తోంది. తదుపరి తరం డిజిటల్ కనెక్టివిటీ సేవలపై వినియోగదారుల విశ్వాసం, ఆదరణ నిరంతరం పెరుగుతోందనడానికి ఇవి నిదర్శనంగా నిలుస్తున్నాయి. జూన్ నెలాఖరు నాటికి జియో మొత్తం వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 3.26 కోట్లకు చేరుకుంది. దీంతో కంపెనీ 36.9 శాతం మార్కెట్ వాటాను నమోదు చేసింది. ఒక్క జూన్ నెలలోనే 1,78,546 నికర వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు జియో నెట్‌వర్క్‌లో చేరారు. వైర్‌లైన్ బ్రాడ్‌బ్యాండ్ సేవల్లోనూ జియో తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 42.7 శాతం మార్కెట్ వాటాతో రాష్ట్రంలో అతిపెద్ద వైర్‌లైన్ బ్రాడ్‌బ్యాండ్ సేవల సంస్థగా




కొనసాగుతోంది. జూన్ నెలలో 28,267 కొత్త కనెక్షన్లు జోడించడంతో మొత్తం వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 21 లక్షలకు చేరుకుంది. వేగంగా విస్తరిస్తున్న హోమ్ బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో జియో తన ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ సేవల్లోనూ జియో తన అగ్రస్థానాన్ని కొనసాగిస్తోంది. గణాంకాల ప్రకారం, ప్రాంతంలోని 5జీ ఫీఔూ మార్కెట్‌లో జియో 70.5 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. మొత్తం దాదాపు 11 లక్షల మంది ఫీఔూ వినియోగదారుల్లో 7,75,442 మంది జియో సేవలను వినియోగిస్తున్నారు. జూన్ నెలలోనే మరో 8,629 మంది కొత్త ఫీఔూ సబ్‌స్క్రైబర్లు జియోతో అనుసంధానమయ్యారు. అలాగే 5జీ అన్‌లైసెన్స్ బ్యాండ్ రేడియో (ఖదీ=) విభాగంలో సబ్‌స్క్రైబర్లను నమోదు చేస్తున్న ఏకైక టెలికాం ఆపరేటర్గా జియో కొనసాగుతోంది. జూన్ చివరి నాటికి ఈ విభాగంలో జియో సబ్‌స్క్రైబర్ల సంఖ్య 4,18,347కు చేరుకోగా, ఒక్క నెలలోనే 19,799 మంది కొత్త వినియోగదారులు చేరారు. అభివృద్ధి చెందుతున్న ఫిక్స్‌డ్ వైర్‌లెస్ టెక్నాలజీల్లో జియో సాధించిన ముందంజకు ఇది నిదర్శనం. జూన్ 2026 ం=ూ× గణాంకాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో జియో బలమైన పోటీ సామర్థ్యాన్ని మరోసారి రుజువు చేశాయి. వైర్‌లెస్ సేవల్లో నిరంతర వృద్ధిని నమోదు చేస్తూనే, వైర్‌లైన్ బ్రాడ్‌బ్యాండ్ విస్తరణ, 5జీ ఆధారిత హోమ్ బ్రాడ్‌బ్యాండ్‌కు పెరుగుతున్న ఆదరణ, యాక్టివ్ వైర్‌లెస్ వినియోగదారులలో అత్యధిక వృద్ధి ద్వారా అధిక విలువ కలిగిన బ్రాడ్‌బ్యాండ్ విభాగాల్లో జియో తన ఆధిపత్యాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటోంది.

## స్పోర్ట్స్





### టీమిండియాకు గుడ్‌బై చెప్పిన గంభీర్ స్నేహితుడు

భారత క్రికెట్ జట్టు సహాయక సిబ్బందిలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డష్కటే, ఫీల్డింగ్ కోచ్ టీ. దిలీప్‌ల కాంట్రాక్టులను పొడిగించకూడదని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయించింది. ఇటీవల ముగిసిన ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల సమయంలోనే ఇద్దరి కాంట్రాక్టు గడువు పూర్తయిందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. వారి ఒప్పందాలను ఇకపై కొనసాగించడం లేదని తెలిపారు. గౌతమ్ గంభీర్ కోచింగ్ బృందంలో భాగంగా 2024లో భారత జట్టుతో చేరిన డష్కటే రెండేళ్ల పాటు సేవలందించారు. అయితే కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలనే ఉద్దేశంతో ఆయన ఎక్కువ కాలం జట్టుతో ప్రయాణించే బాధ్యతను కొనసాగించేందుకు ఆసక్తి చూపలేదని సమాచారం. భారత జట్టు నుంచి వైదొలిగిన అనంతరం డష్కటే తిరిగి ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ కోచింగ్ బృందంలో చేరే అవకాశం ఉంది. డష్కటే గంభీర్‌కు ఆప్త మిత్రుడు. వీరిద్దరికి ఐపీఎల్‌లో కేకేఆర్‌కు ఆడిన రోజుల్లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వీరు స్నేహం కొనసాగించారు. డష్కటే టీమిండియా కోచ్ కావడానికి గంభీరే ప్రధాన కారకుడు. మరోవైపు, ఫీల్డింగ్ కోచ్ టీ. దిలీప్ స్థానంలో కొత్త వ్యక్తిని నియమించే ప్రక్రియను బీసీసీఐ ప్రారంభించింది. శ్రీలంక పర్యటనకు ముందే కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను ఖరారు చేయాలని బోర్డు భావిస్తోంది. ఫీల్డింగ్ కోచ్ పదవికి సుభదీప్ ఘోష్ పేరు ముందంజలో ఉన్నట్లు సమాచారం. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన కొంతమంది కోచ్‌లు, మాజీ క్రికెటర్ల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

# అటు అజయ్... ఇటు సర్వేశ్

గ్లాస్గో : పోలియో రాకసి రూపంలో వచ్చిన వైకల్యాన్ని.. పెండ్లి రూపంలో ఎదురైన కష్టాలను అధిగమించి క్రీడలకు రిటైర్మెంట్ ఇచ్చే 34 ఏండ్ల లేటు వయసులో కెరీర్ ఆరంభించిన ధీర వనిత షర్మిల ధన్‌ఖడ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కొత్త చరిత్ర సృష్టించింది. మెగా గేమ్స్ చరిత్రలో పారా అథ్లెటిక్స్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించిన క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. మహిళల పారా షాట్‌పుట్‌లో షర్మిల స్వర్ణం గెలవగా.. ఇదే పోటీలో శిల్పా శైలా కాంస్యంతో మురిసింది. ఇంకోవైపు తండ్రి బాటలో పయనించిన తెలుగు వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు, హై జంపర్ సర్వేశ్ కుశారే రజతాలతో మెరడంతో కామన్వెల్త్‌తో భారత పతకాల సంఖ్య పదికి చేరింది. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఎఫ్57 కేటగిరీ మహిళల షాట్‌పుట్‌లో షర్మిల గుండును 9.81 మీటర్ల దూరం విసిరి గోల్డ్ సొంతం చేసుకుంది. 20 ఏండ్ల కామన్వెల్త్ పారా అథ్లెటిక్స్ చరిత్రలో భారత్‌కు ఇదే తొలి పసిడి కావడం విశేషం. శిల్ప 7.26 మీటర్ల త్రో చేసి కాంస్యం అందుకుంది. తొలుత నైజీరియాకు చెందిన యుకారియా ఇయాజీ మూడో స్థానంలో నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. అయితే, భారత్ నిరసనతో నిర్వహించిన రివ్యూలో నైజీరియా అథ్లెట్ ఫౌల్ చేసినట్టు తేలడంతో శిల్పకే కాంస్యం దక్కింది. ఇక, పురుషుల హైజంప్‌లో కొద్దిలో స్వర్ణం చేజార్చుకున్న సర్వేశ్ కుశారే రజతం అందుకున్నాడు. హోరాహోరీగా సాగిన పోటీలో సర్వేశ్, జమైకా జంపర్ రొమైన్ బెక్‌ఫోర్డ్ ఇద్దరూ 2.25 మీటర్లు ఎత్తు దూకారు. కానీ, 2.28 మార్కును అధిగమించలేకపోయారు. విజేతను తేల్చేందుకు అంతకుముందు చేసిన ప్రయత్నాల్లో ఇద్దరు అథ్లెట్ల వైఫల్యాలను (కౌంట్ బ్యాక్) లెక్కించారు. ఒకేసారి విఫలమైన బెక్‌ఫోర్డ్ స్వర్ణం అందుకోగా.. రెండు ప్రయత్నాల్లో ఫెయిలైన సర్వేశ్ రజతంతో సంతృప్తి చెందాడు. అయినా కామన్వెల్త్ గేమ్స్ హైజంప్‌లో సిల్వర్ నెగ్గిన భారత అథ్లెట్‌గా రికార్డు సృష్టించాడు.










### ఒక్క కేజీ తేడాతో అజయ్‌కు గోల్డ్ మిస్

ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు పురుషుల 79కేజీ కేటగిరీలో సిల్వర్ నెగ్గాడు. 21 ఏండ్ల అజయ్ ఫైనల్లో మొత్తం 330 కిలోల బరువెత్తి రెండో స్థానం సాధించాడు. 145 కిలోలతో స్నాచ్‌ను ఆరంభించిన అజయ్ రెండో ప్రయత్నంలో విఫలమైనా చివరగా 149కిలోల బరువు మోసి గేమ్స్ రికార్డు సృష్టించాడు. క్లీన్ అండ్ జర్క్‌లో గోల్డ్ ఫేవరేట్‌గా బరిలోకి దిగాడు. 181 కేజీలను క్లియర్ చేసినా ఒక్క కిలో తేడాతో కొద్దిలో స్వర్ణం కోల్పోయాడు. మలేసియాకు చెందిన ఎరీ హిదాయత్ మొత్తం 331 (147o184) కేజీలతో పసిడి సొంతం చేసుకోగా.. ఇంగ్లండ్ లిఫ్టర్ క్రిస్ మర్రే (325 కేజీ) కాంస్యం అందుకున్నాడు. కాగా, మహిళల 63 కిలోల విభాగంలో నిరుపమ నిరాశపరిచింది.

### విధిరాతను ఎదిరించి.. స్వర్ణ చరిత్రను లిఖించి

ఒకవైపు వైకల్యం.. మరోవైపు నరకం చూపించే గృహ హింస.. ఇంకోవైపు ఇద్దరు చిన్నారులతో వీధిపాలైన దయనీయ స్థితి. ఇక ఈ జీవితం ముగిసిపోయింది.. ఆత్మహత్యే శరణ్యం అని అనుకున్న అత్యంత చీకటి క్షణంలో ఆమె ఒక ఓ నిర్ణయం తీసుకుంది. 'నా జీవితానికి మరో అవకాశం ఎందుకు ఇవ్వకూడదు?' అని తన్నుకొచ్చిన ఆ ఆలోచనే ఆమె భవితవ్యాన్నే మార్చేసింది. చావు అంచున నిలబడి బతుక్కి రెండో చాన్స్ ఇచ్చిన ఆ నిర్ణయమే హర్యానాకు చెందిన 42 ఏండ్ల షర్మిల ధన్‌ఖడ్ కామన్వెల్త్ గేమ్స్ పారా అథ్లెటిక్స్‌లో పసిడి పతకం నెగ్గేలా చేసింది. హర్యానాలోని మహేందర్‌గఢ్ జిల్లా చిత్రౌలి గ్రామంలో నిరుపేద రైతు కుటుంబంలో జన్మించింది షర్మిల. తల్లి చూపులేనిది కావడంతో బాల్యం నుంచే కష్టాలు చవిచూసింది. రెండేండ్ల వయసులోనే తీవ్రమైన జ్వరం రాగా, సరైన వైద్యం అందక ఎడమ కాలు పోలియో బారిన పడింది. పదో తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పిన ఆమెకు 19 ఏండ్లకే పెళ్లి చే03శారు. అదనపు కట్నం తెమ్మంటూ భర్త తీవ్రంగా వేధించేవాడు. ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చిందనే కోపంతో ఓ రోజు రాత్రి 11 నుంచి 3 గంటల దాకా చితకబాది, ఇద్దరు పసిపాపలతో సహా రోడ్డుపైకి తోసేశాడు. కనీసం బస్సు చార్జీలకు కూడా డబ్బులు లేని దయనీయ స్థితిలో షర్మిల ఆత్మహత్య చేసుకోవాలని భావించినా.. పిల్లల కోసం బతకాలని నిర్ణయించుకుంది. వారి పోషణ కోసం ఇండ్లలో పనులతో పాటు సెక్యూరిటీ గార్డుగా, స్వీపర్‌గా పనిచేసింది. ఇన్ని కష్టాల నడుమ వ్యాపారవేత్త అజిత్ సింగ్ రూపంలో ఆమెకు ఓ చేయుత లభించింది. అజిత్‌తో రెండో వివాహం జరిగాక ఆమె జీవితం మలుపు తిరిగింది. షర్మిల మానసిక దృఢత్వాన్ని, పట్టుదలను గుర్తించిన అజిత్ 2020లో (34 ఏండ్ల వయసులో) ఆమెను పారా అథ్లెటిక్స్ వైపు ప్రోత్సహించాడు. సాధారణంగా క్రీడాకారులు రిటైర్మెంట్ ప్రకటించే వయసులో షర్మిల తొలిసారి చేతిలోకి



# అనుకున్న సమయానికే ఇరుముడి

రవితేజ తాజా చిత్రం 'ఇరుముడి' విడుదల తేదీ విషయంలో ఎలాంటి అయోమయం లేదని, ముందుగా ప్రకటించినట్లుగా ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకొస్తున్నదని మంగళవారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఆధ్యాత్మిక అంశాల కలబోతగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌గ్లింప్స్‌తో పాటు 'ఇరుముడి కట్టు' అనే అయ్యప్పభక్తి పాటకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని చిత్రబృందం వెల్లడించింది. త్వరలో ఈ సినిమాలోని రెండోపాటను రిలీజ్ చేస్తామని చిత్ర దర్శకుడు శివ నిర్వాణ తెలిపారు. ప్రియాభవానీశంకర్, సాయికుమార్, బేబీ నక్షత్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: శివ నిర్వాణ.



# ఇదే నిజమైన విజయం

'నాకు పర్సనల్‌గా ప్రేమకథలంటే చాలా ఇష్టం. కోవిడ్ తర్వాత లవ్‌స్టోరీస్ తగ్గిపోతుంటే బాధపడ్డాను. మళ్లీ ఇప్పుడు ట్రెండ్ మొదలైంది. 'చెన్నై లవ్‌స్టోరీ'తో మరో కల్ట్ లవ్‌స్టోరీ ఇండస్ట్రీకి దక్కింది' అన్నారు హీరో నాగచైతన్య. మంగళవారం జరిగిన 'చెన్నై లవ్‌స్టోరీ' సక్సెస్‌మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహించగా.. ఎస్‌కేఎన్, సాయిరాజేష్ నిర్మించారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ.. ఈ సినిమాలో తాను కోరుకునే ప్రేమకథను చూశానని, ఎంతో పరిణితితో రాసిన స్టోరీ ఇదని, పోస్టర్ మీద కలెక్షన్స్ నెంబర్స్ వేయడం కంటే ఇదే నిజమైన విజయంగా భావిస్తానని చెప్పారు. ఈ సినిమాలోని ఎమోషన్స్‌తో పాటు క్యారెక్టర్స్‌కు ప్రతీ ఒక్కరూ కనెక్ట్ అవుతున్నారని, నాగచైతన్యను చూస్తే తన మంచికోరే అన్నలా అనిపిస్తారని కిరణ్ అబ్బవరం ఆనందం వ్యక్తం చేశారు. నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ 'నాలుగు రోజుల్లోనే అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ అయింది. మూడురోజుల్లో 40.1కోట్ల రూపాయల వసూళ్లు దక్కాయి. బ్లాక్‌బస్టర్ కాదు..అంతకుమించి సక్సెస్ సాధించింది' అన్నారు. సోమవారం వసూళ్లు చూశాక ఈ సినిమాను ప్రేక్షకులు ప్రేమిస్తున్నారని అర్థమైందని నిర్మాత, చిత్ర రచయిత సాయిరాజేష్ సంతోషం వ్యక్తం చేశారు. తనకు నిజమైన కెరీర్‌ని ఇచ్చిన చిత్రమిదని, ప్రేక్షకులు ఇంతటి ప్రేమను చూపిస్తారని అస్సలు ఊహించలేదని కథానాయిక శ్రీగౌరిప్రియ పేర్కొన్నది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# షీ ఈజ్ మై బుజ్జి బ్యూటీ..

మల్టీ టాలెంటెడ్ జీవీ ప్రకాశ్‌కుమార్, కయదు లోహర్ జంటగా నటిస్తున్న డార్క్ ఫాంటసీ సూపర్ నాచురల్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్'. మరియప్పన్ చిన్న దర్శకుడు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉన్నది. ఇప్పటికే విడుదల చేసిన పాటకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. తాజాగా ఈ సినిమా నుంచి రెండో పాటను మంగళవారం విడుదల చేశారు. 'షీ ఈజ్ మై లవ్లీ ప్రెట్టీ.. షీ ఈజ్ మై బుజ్జి బ్యూటీ.. షీ ఈజ్ మై హాటీ స్వీటీ..' అంటూ ఆధునిక ధోరణిలో సాగే ఈ పాటను రాజశ్రీ సుధాకర్ రాయగా, సామ్ సీఎస్ స్వరపరిచారు. అరవింద్ శ్రీనివాస్ ఆలపించారు. ఈ పాటలో జీవీ ప్రకాశ్‌కుమార్, కయదు లోహర్‌ల మధ్య కెమిస్ట్రీ ఆసక్తికరంగా ఉంది. యువతరం సంగీత ప్రియులను ఆకట్టుకునేలా ఈ పాటను చిత్రీకరించారని తెలుస్తున్నది. టీఎం కార్తీక్, కుమార్ నటరాజన్, ఆదిత్య కతిర్, అర్జు మహర్జన్, సునీతా శ్రేష్ఠ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అరుణ్ రాధాకృష్ణన్, నిర్మాణం: ఏకే ఫిల్మ్ ఫ్యాక్టరీ.



# ఆరు నెలలు నాతో మాట్లాడలేదు

'లెనిన్'తో ఎట్టకేలకు హిట్ ట్రాక్ ఎక్కేసింది పూణే పూబోణి భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం 'లెనిన్' సక్సెస్‌ని ఎంజాయ్ చేస్తూ, మరోవైపు తమిళంలో శివకార్తికేయన్ సరసన 'సియోన్' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నది ఈ అందాలభామ. తాజాగా ఓ కళాశాల విద్యార్థులతో టాక్ షోలో ముచ్చటించిన భాగ్యశ్రీ.. తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నది. 'నాకు నటనంటే ఇష్టం. నటిని కావడం నా గోల్. కెరీర్ విషయంలో మన నిర్ణయాన్ని మన మనస్సాక్షి అంగీకరించినప్పుడు, ఇక ఏ విషయంలోనూ రాజీ పడాల్సిన అవసరం లేదు. ఒకవేళ రాజీ పడాల్సివస్తే, మనకు మనమే పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. అందుకే నా నిర్ణయాన్ని నేరుగా అమ్మకు ఫోన్ చేసి చెప్పాను. 'వద్దు' అనింది. నాన్నకు ఫోన్ చేస్తే 'అమ్మ వద్దన్న పని ఎలా చేస్తావ్?' అని ప్రశ్నించారు. అక్క అయినా మద్దతుగా నిలుస్తుందనుకుంటే.. 'అమ్మ నాన్న వద్దంటున్నారు కదా?' అనేసింది. ఇలా అంతా 'నో' చెప్పేశారు. కానీ నేను మాత్రం వెనక్కి తగ్గలేదు. ఆడిషన్స్‌కి వెళ్లిపోయా. దీంతో ఇంట్లో వాతావరణం వేడెక్కింది. మా అమ్మ ఆరు నెలలు నాతో మాట్లాడ్లేదు. నన్ను వాట్సాప్‌లో కూడా బ్లాక్ చేసింది. ఇప్పుడు ఈ విషయాన్ని నవ్వుతూ చెబుతున్నాను కానీ.. అప్పుడు మాత్రం చాలా బాధపడ్డా' అంటూ తన కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నది భాగ్యశ్రీ బోర్సే.

Printed & Published by YAMJALA PRAVEEN, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, 11-1/B/42, BPM GREEN LANDS COLONY, SHABARI GARDENS BACK, PARVATHAPUR, MEDIPALLY MANDAL, PEERZADIGUDA, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098. And Published From 4-33, NEAR HANUMAN TEMPLE, ALLAPUR VILLAGE, CHOUTUPPAL MANDAL, YADADRI BHUVANAGIRI, and TELANGANA - 508252. Editor: YAMJALA PRAVEEN,PJI.No. TGTEL/26/A6221, Ph.No- 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website : www.tholivelugu.com